ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు షాక్..!

● ఈ ఏడాది నుంచి గ్రేస్ మార్కులు రద్దు

● హిజాబ్‌కు అనుమతిపై హోంమంత్రితో చర్చించి నిర్ణయం

● విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప



బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రస్తుతం ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు రాసేవారికి 10శాతం మార్కులు వర్తించవు. సోమవారం ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కొవిడ్‌కాలంలో వర్తింపచేసిన పదిశాతం గ్రేస్ మార్కులను రద్దు చేశామన్నారు. ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థుల్లో పరీక్షల భయం తొలగించడంతోపాటు అవకాశం కల్పించేందుకోసం పిల్లలకు ఫోన్ చేసి చక్కగా చదువుకోవాలని సలహాలు ఇవ్వనున్నామన్నారు. రోజుకు ఒక మార్కు పెంచుకునే లాంటి కార్యక్రమం వర్తింపచేస్తామన్నారు. స్పెషల్ క్లాసులు అవసరమైన విద్యార్థులకు నిర్వహిస్తామన్నారు. 10శాతం గ్రేస్‌మార్కులు రద్దు చేసినా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా మార్కులు పెంచదలిచామన్నారు. పరీక్షల్లో హిజాబ్‌కు అనుమతికి సంబంధించిన విషయమై స్పందిస్తూ వివాదం కోర్టులో ఉందని ఇంకా పరిష్కారం కాలేదన్నారు. హోం మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

నేహా హత్య వెనుక ఓ ఎమ్మెల్యే హస్తం..!

● తండ్రి నిరంజన్ హిరేమఠ్ ఆరోపణ

7

బెంగళూరుకు మరో ఎయిర్‌పోర్ట్ అవసరం


● రాజ్యసభలో మాజీ ప్రధాని దేవెగౌడ

దళం..అయోమయం..!

● జేడీఎస్ భవితవ్యం అగమ్యగోచరం ● ప్రజ్వల్ వివాదం మాయని మచ్చ

● వరుస ఓటములతో నిఖిల్ డీలా ● కేంద్రమంత్రిగా కుమారస్వామి బిజీ

● నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన ● ఆపరేషన్ హస్తతో భయం..భయం..



బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం అనిపించిన జేడీఎస్ నేడు డీలా పడింది. గ్రామస్థాయి నుంచి లోక్‌సభ స్థాయి దాకా ఎన్నికలు ఏవైనా సవాల్ చేస్తూ రంగంలోకి దిగి ప్రభావం చూపుతూ ఎంతోమందికి కీలకమైన పదవులను వరింపచేసిన పార్టీ భవిష్యత్తు ఆగమ్యగోచరం అనేలా మారింది. నాలుగు దశాబ్దాలుగా జేడీఎస్ పార్టీ రాష్ట్రంలో ప్రభావం కొనసాగించింది. ఇటీవల వరుస దెబ్బలు పార్టీకి ప్రత్యేకించి జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తీశాయి. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితి పార్టీకి ఎదురుకావడంతో కార్యకర్తలు తమ భవిష్యత్తు కోసం పక్కదారులు చూసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అందుకు మరింత బలం చేకూర్చేలా డీసీఎం డీకే శివకుమార్ 'మాతో కలసి రండి... అండగా ఉంటామని, ఎవరినీ చేజార్చికోనివ్వమని' బహిరంగంగా పిలుపునివ్వడం జేడీఎస్ నేతలకు సవాల్ విసిరినట్లు అవుతోంది.

శాసనసభలో తగ్గిన బలం

నాలుగు దశాబ్దాల రాష్ట్ర రాజకీయ చరిత్రలో పార్టీ ఏదైనా జేడీఎస్ పార్టీ కనీసం 30-40మంది దాకా శాసనసభ్యులు ఉండేవారు. ఇదే బలంతో కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలో ఉండే పార్టీలకు మద్దతు ఇవ్వకపోయినా, ప్రతిపక్షంగా ధీటుగా శాసనసభలో సభ్యులు సర్కార్‌ను నిలదీసేవారు. 2023 శాసనసభ ఎన్నికల్లో జేడీఎస్ బలం ఒక్కసారిగా 19కి పడిపోయింది. ఆ తర్వాత చన్నపట్టణకు జరిగిన ఉప ఎన్నికల్లో ఓటమితో, ప్రస్తుతం శాసనసభలో జేడీఎస్‌కు 18మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. ఎమ్మెల్యేలు తగ్గినా కుమారస్వామి సభలో ఉంటే అధికారంలో ఉండే ముఖ్యమంత్రితోపాటు మంత్రులు ఆచితూచి మాట్లాడేవారు. ప్రస్తుతం కుమారస్వామి కేంద్రంలో మంత్రి కావడంతో శాసనసభకు దూరమయ్యారు. ఇక లోక్‌సభలో కనీసం ముగ్గురు నలుగురు ఎంపీలు ఉండేవారు. అయితే దేవెగౌడ సభలో ఉండడం ద్వారా పార్టీకి గౌరవంతోపాటు సమస్యలపై మాట్లాడేందుకు మాజీ ప్రధాని హోదాలోనూ అవకాశం లభించేది. 2019 ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. హాసన్ నుంచి ప్రజ్వల్ రేవణ్ణ మాత్రమే ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో మండ్య నుంచి కుమారస్వామి, కోలారు నుంచి మల్లేశ్‌బాబు గెలుపొందారు. కుమారస్వామి కేంద్రమంత్రి కావడంతో రాష్ట్ర రాజకీయాలకు దూరమయ్యారు. జేడీఎస్ ఎమ్మెల్యేలు ఏ ఒక్కరు కూడా రాష్ట్రస్థాయి రాజకీయాలను మాట్లాడేవారు లేకపోవడం, పార్టీకి తీరనిలోటుగా మారింది.

ప్రజ్వల్ వివాదం..

రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ వివాదం పార్టీతోపాటు దేవెగౌడ కుటుంబానికి శాశ్వతమైన మచ్చగా మిగిలింది. ఓటమి ఎరుగని నాయకుడిగా దేవెగౌడకు పేరుండేది. ఆయన హాసన్ నుంచి వరుసగా గెలుపొందుతూ వచ్చారు. 2019లో మనవడు ప్రజ్వల్‌కోసం కంచుకోటను వీడి తుమకూరునుంచి పోటీ చేసి ఓడిపోయారు. తొలిసారి ఎంపీ అయిన ప్రజ్వల్ రాసలీలల వ్యవహారం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఛీత్కారాలకు కారణమయ్యింది. ఎంతోమంది మహిళలతో రాసలీలలకు పాల్పడి వీడియోలను చిత్రీకరించుకున్న దృశ్యాలు పెన్‌డ్రైవ్‌ల రూపంలో వైరల్ అయ్యాయి. ఎనిమిది నెలలుగా జైలులోనే ఉన్నాడు. కాగా ప్రజ్వల్ అన్న సూరజ్ హోమోసెక్స్ కలాపాలకు పాల్పడి జైలుపాలై బెయిల్‌పై విడుదలయ్యాడు.





జేడీఎస్ కేంద్ర కార్యాలయం

వేధిస్తున్న వయోభారం..!

జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ వయోభారం కారణంగా క్రియాశీలకంగా వ్యవహరించలేకపోతున్నారు. గ్రామస్థాయి నుంచి అంచెలంచెలుగా రాజకీయాల్లో ఎదిగి దేశంలో అత్యున్నతమైన ప్రధానమంత్రి పదవిని పొందిన ఆయన ఇటీవలికాలంలో పార్టీకి ఎదురవుతున్న దెబ్బలను చూసి తట్టుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. పార్టీలో ఆయన తర్వాత కీలకమైన నేత కుమారస్వామి కేంద్రమంత్రిగా ఢిల్లీలో బిజీగా ఉండడంతో సామాన్య కార్యకర్తలకు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు, పార్టీ ముఖ్యులు సైతం ఇటీవల ఆరేడు నెలలుగా స్తబ్ధతగా కొనసాగుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ మనుగడకు ఎదురుదెబ్బ పడనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం జేడీఎస్‌లో నిఖిల్ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నా వరుసగా ఎన్నికల్లో ఓటమి చెందిన అతడిపట్ల పార్టీ వర్గాలు అంతగా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇలా మాజీ ప్రధాని దేవెగౌడ జేడీఎస్ సామ్రాజ్యం దినదినగండంగా మారుతున్నట్లు అవుతోంది.

కేంద్రమంత్రిగా కుమారస్వామి బిజీ



జేడీఎస్ పార్టీలో దేవెగౌడ ప్రభావం నేటికీ ఉంది. అయితే ఆయన వయోభారం కారణంగా క్రియాశీలకంగా పర్యటించలేకపోతున్నారు. మరోవైపు రేవణ్ణ పార్టీలో సీనియర్ అయినా అందరినీ కలుపుకుపోవడం, కీలకమైన నిర్ణయాలు తీసుకునేవారు కాదనేది తెలిసిందే. ఇక ఆయన కుమారులు ఇద్దరి పరిస్థితి అధ్వానమే. కుమారస్వామి రాష్ట్ర రాజకీయాలను వీడి కేంద్రమంత్రి కావడంతో దేశవ్యాప్త పర్యటనలో బిజీగా ఉన్నారు. స్థానిక నాయకులకు ఒకప్పటిలా అందుబాటులో లేరనేది తెలిసిందే. ఇక నిఖిల్ సాహసం చేస్తున్నా అతడి నిర్ణయాలు, ఆదేశాలు సాధారణ కార్యకర్తల వరకే పరిమితం అవుతోంది. కానీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను దిశా నిర్దేశం చేసే పరిస్థితి లేదు. వరుస ఓటములు ఇంకా అతడిని ఫోబియానుంచి బయటకు తీసుకురాలేదనిపిస్తోంది. వయసుతో సంబంధం లేకుండా మార్చి నుంచి జిల్లాలవారీగా తిరిగి పార్టీని బలోపేతం చేస్తానని దేవెగౌడ తాజాగా సవాల్ విసిరారు. అది ఎక్కడిదాకా కొనసాగుతుందో పార్టీ ఏమేరన పటిష్టం అవుతుందో వేచి చూడాలి.

కీలక పదవులన్నీ కుటుంబ సభ్యులకే..

దేవెగౌడ కుటుంబ సభ్యులను ప్రజాప్రతినిధులుగా చేయడంలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. ఇలా ఆయన కుమారుడు కుమారస్వామి పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్నారు. కుమారస్వామి భార్య అనిత ఎమ్మెల్యేగా కొనసాగారు. వీరి కుమారుడు నిఖిల్‌ను ప్రజాప్రతినిధిని చేయాలనే దేవెగౌడ పట్టుదల ఏడేళ్లుగా సాధ్యం కాలేదు. మండ్య లోకసభ ఎన్నికల్లో ఓటమి చెందినా, 2024 శాసనసభ ఎన్నికల్లో రామనగర నుంచి పోటీ చేయించగా అందులోనూ ఓడిపోయారు. తాజాగా జరిగిన చన్నపట్టణ ఉప ఎన్నికల్లోనూ అభ్యర్థిని చేస్తే ఘోరంగా ఓటమి చవిచూశారు. ఇక మరో కుమారుడు హెచ్‌డీ రేవణ్ణ హాసన్ జిల్లా నుంచి నిరంతరంగా ఎమ్మెల్యేగా ఉన్నారు. పలుమార్లు మంత్రిగాను వ్యవహరించారు. ఆయన భార్య భవాని జడ్పీ సభ్యురాలిగా వ్యవహరించారు. రేవణ్ణ కుమారులలో ప్రజ్వల్ హాసన్ ఎంపీగా ఒక పర్యాయం కొనసాగగా మరో కుమారుడు సూరజ్ ఎమ్మెల్సీగా ఉన్నాడు. దేవెగౌడ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా వ్యవహరించగా కుమారస్వామి ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రి అయ్యారు. ఇటువంటి అవకాశాలు పార్టీలో కుటుంబీకులకు మినహా మరొకరికి కల్పించలేదనే విమర్శలు ఉన్నాయి.



ఒంటరి ఏనుగును అడవిలోకి పంపుతున్న స్థానికులు

హడలెత్తించిన ఒంటరి ఏనుగు

హోసూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగును చూసిన స్థానికులు హడలెత్తిపోయారు. హోసూరు సమీపంలోని రాయకోట వైపు నుంచి తిమ్మేపల్లి పంచాయతీ ప్రాంతం కొండపైకి ఆదివారం ఒంటరి ఏనుగు రావడంతో అటుగా వెళ్తున్న ప్రజలు ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. ప్రజల సందడితో ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా అదే చోట నిలబడిపోయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని ఏనుగు పిల్లను అటవీ ప్రాంతానికి మళ్ళించేందుకు మళ్లించారు. రాయకోట అటవీ పరిధిలో ఊడేదుర్గం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఏనుగులు అధికంగా ఉన్నాయి. ఏనుగులు తరచూ పట్టణంలోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తుంటాయి.

పికెల్‌బాల్ విజేత బెంగళూరు జట్టు



ట్రోఫీతో విజేత జట్టు

7

అన్నదాతను ముంచేస్తున్నారు..!

● నకిలీ సేంద్రియ ఎరువులతో నిండా మోసం

● వ్యాపారులపై తిరగబడిన రైతులు ● వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం




కాంతెబెన్నూరు గ్రామంలో ఎరువుల ఆటోను అడ్డుకుంటున్న రైతులు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నకిలీ సేంద్రియ ఎరువులతో అన్నదాతను నిండా ముంచేస్తున్నారు. విజయనగర జిల్లా పరిధిలోని హూవినహడగలి, కూడ్లిగి, కొట్టూరు తదితర ప్రాంతాల్లో మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఎరువులు నకిలీవి అని తేలడంతో రైతులు లబోదిమోమంటున్నారు. తక్కువ రేటుకు ఇస్తామని నమ్మపలికి నకిలీ వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన లేక డబ్బునష్టపోయి దిగులు చెందుతున్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ మందులతో రైతులను నిండా ముంచుతున్నా వ్యవసాయ అధికారులు పట్టీపట్టనట్లు ఉన్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హూవినహడగలి తాలూకా పరిధిలోని కాంతాబెన్నూరు గ్రామంలో సేంద్రియ ఎరువుల పేరుతో కొన్ని కంపెనీలు నిండా ముంచేస్తున్నాయని రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. రాణిబెన్నూరుకు చెందిన అనధీకృత ఎరువుల ఉత్పత్తి దారులు, గ్రామంలోని రైతుల ఇళ్ళవద్దకే వచ్చి ఎరువులు అమ్మకాలు చేస్తున్నారు. ఎరువులను అమ్మిన వ్యాపారులను గ్రామానికి పిలిపించి ఎరువును నీటిలోవేయగా బురదగా మారడాన్ని చూపించినట్లు రైతు విరుపాక్షప్ప పక్కీరప్ప తెలిపారు. వ్యాపారులు, వారి వాహనాలను వదిలేది లేదని, రైతులు భీష్మించి కూర్చొన్నారు . విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయ అధికారులు, వ్యాపారులను, ఎరువుల బస్తాలను హిరేహడగలి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు.వ్యవసాయ శాఖ, రైతులు అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతులు కొనుగోలు చేసిన సేంద్రీయ ఎరువును పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపుతామని, రిపోర్టు వచ్చిన తర్వా వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అనధికృతంగా ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయరాదని వ్యవసాయ శాఖ అధికారిమహ్మద్ అశ్రఫ్ సూచించారు.



నీటిలో ముంచగానే బురదగా మారిన నకిలీ ఎరువు



ఢిల్లీ చేరిన బీజేపీ పంచాయితీ

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీలో నెలకొన్న గ్రూపు విభేదాల పంచాయితీ ఢిల్లీకి చేరింది. ఇప్పటికే బెంగళూరు నుంచి ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళి, మాజీ ఎమ్మెల్యే కుమారబంగారప్ప, ఎన్ఆర్ సంతోష్‌లు ఢిల్లీ వెళ్లారు. మంగళవారం బసనగౌడపాటిల్ యత్నాళ్, మాజీ ఎంపీ జీఎం సిద్దేశ్వర్‌లు చేరుకోనున్నారు. రెండురోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి రాష్ట్ర పార్టీ అధ్యక్షస్థానానికి ఎన్నికలు జరపాలని అధిష్ఠానం పెద్దలతో ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉంది. ఇదే ప్రతిపాదనతోనే వారు ఢిల్లీ వెళ్లారు. రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ బిజీగా ఉన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నందున కేంద్రమంత్రి అపాయింట్‌మెంట్ దొరికేదాకా అక్కడే ఉండాలని తీర్మానించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరపాలని భావిస్తున్న తరుణంలోనే 23 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలతో భేటీ కావాలని తీర్మానించారు. డిపాజిట్లు కోల్పోయే వ్యక్తులు కూడా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారని, ఎన్నికలు జరిపితే ఎవరి సత్తా ఏమిటో తేలనుందని వీరు సవాల్ చేస్తున్నారు. ఢిల్లీలో ప్రధానంగా కొన్ని అంశాలను నేతలతో ప్రస్తావించాలని తీర్మానించారు. కర్ణాటకలో కుటుంబ రాజకీయాలకు బీజేపీలో స్వస్తి పలకాలని, ఇటీవల ఎన్నికల్లో ఓటమికి లోపాయకారీ ఒప్పందాలే కారణమని, వారినే కొనసాగిస్తే మనుగడ ఉండదని వివరించదలిచారు. ఇలా రాష్ట్ర బీజేపీ పంచాయితీ ఢిల్లీకి చేరింది. అయితే పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికలు కొనసాగించరాదని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఎన్నికలు జరిపితే పార్టీలో ఇప్పటికే గ్రూపులు ఉన్నాయని ఇది మరింత అగాధానికి కారణం కానున్నాయని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరికొంత కాలం విజయేంద్రను అధ్యక్షుడిగా కొనసాగించాలనే ఆలోచనలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు బళ్ళారి వివాదం మలుపులు తిరుగుతోంది. గదగ్‌లో శ్రీరాములు మాట్లాడుతూ కాంగ్రెస్‌వారు ఆహ్వానించింది వాస్తవమేనని, నన్ను అడ్డుకునే శక్తి ఎవరికైనా ఉందా..? అని ప్రశ్నించారు. అందరినీ ఒకే గాటికి కట్టివేయడం సరికాదన్నారు. సమస్యకు పరిష్కారం ఉంటుందని, అధిష్ఠానం అందరికి గుర్తింపు ఇస్తుందన్నారు. రాష్ట్రంలో ఏడెనిమిదిశాతం ఓట్లను ప్రభావితం చేసే నాయకులకు గౌరవం ఇవ్వాలన్నారు.

బ్రెయిలీలో రాజ్యాంగం

● శంకర్ ఐ ఫౌండేషన్ రూపకల్పన ● ఆవిష్కరించిన గవర్నర్



బ్రెయిలీ లిపి రాజ్యాంగాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బ్రెయిలీలిపిలో రూపొందించిన రాజ్యాంగాన్ని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ లాంఛనంగా ఆవిష్కరించారు. సోమవారం రాజ్‌భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో శంకర్ ఐ ఫౌండేషన్ పాలకమండలి చైర్మన్ డాక్టర్ కౌశిక్ మురళి, సీఐఐ యంగ్ ఇండియన్స్ యాక్సెబిలిటీ ముఖ్యులు దర్శన్ ముథా, ఆసుపత్రి ప్రముఖులు అనితాలు పాల్గొన్నారు. సంపూర్ణ అంధులతోపాటు పాక్షిక దృష్టి కల్గిన వారు భారతరాజ్యాంగంలోని బాధ్యతలను, ఆశయాలను చదివి అర్థం చేసుకునేందుకు అనుకూలంగా ఉండాలని బ్రెయిలీ రాజ్యాంగం రూపొందించడం అభినందనీయమని గవర్నర్ కొనియాడారు. డాక్టర్ కౌశిక్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలోని బ్రెయిలీ చదివే వారందరికీ అనుకూలం కావాలని భావించామన్నారు. దర్శన్‌ముథా మాట్లాడుతూ దృష్టి లేకపోయినా ఉన్నతవిద్య అభ్యసిస్తున్నారని అయితే రాజ్యాంగాన్ని రూపొందించలేదన్నారు. ఇది ఎంతోమందికి ప్రయోజనం చేకూరనుందని సీఐఐ బెంగళూరు చాప్టర్ ముఖ్యులు కేజే హారిస్ అభిప్రాయపడ్డారు. శంకర్ ఐ ఫౌండేషన్ లాభాపేక్షలేని సంస్థ అని అభిప్రాయపడ్డారు.

మంచి రోజులు వచ్చాయ్..!

- ఎస్సీ హాస్టళ్లకు మహర్దశ
- అభివృద్ధి పనులకు భారీగా నిధులు విడుదల
- రెండో విడతలో 34 హాస్టళ్లకు రూ.5.68 కోట్లు..
- పలుచోట్ల పనులు ప్రారంభం


మరమ్మతులకు ఎంపిక చేసిన ఉరవకొండలోని ఎస్సీ బాలుర వసతిగృహం

అనంతపురం ప్రెస్‌క్లబ్/ ఉరవకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. శిథిలావస్థకు చేరిన, మౌలిక వసతులు లేని వసతిగృహాలను ఎంపిక చేసి మరమ్మతులు చేపడుతోంది. జిల్లాలో ఇప్పటికే మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతోనే సంక్షేమ వసతి గృహాలు అధ్వాన స్థితికి చేరాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొలి దశలో పది ఎస్సీ హాస్టళ్లు

జిల్లాలో తొలి దశలో 10 ఎస్సీ హాస్టళ్లు, ఒక గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయడా నికి ఎంపిక చేశారు. ఆయా భవనాల మరమ్మతుల కోసం రూ. 1.85 కోట్లు విడుదల చేశారు. మూడు నెలల్లోనే పనులు పూర్తి చేశారు. బీసీ సంక్షేమశాఖాధికారులు జిల్లా వ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ వసతిగృహాలను అభివృద్ధి కోసం ఎంపిక చేశారు. ఇందులో 28 వసతి గృహాలకు మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన, 27 వసతిగృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నివేదికలు పంపారు. ఇప్పటికే వీటిన్నింటి కోసం దాదాపు రూ.3.67 కోట్లు అంచనాలు వేసి పంపగా... ఆయా హాస్టళ్లల్లో పనులు కొనసాగుతున్నాయి. తాజాగా రెండో విడత కింద 34 ఎస్సీ హాస్టళ్లను ఎంపిక చేసి రూ. 5.68 కోట్ల నిధులను విడుదల చేశారు. ఇప్పటికే పలు డివిజన్లలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

డివిజన్ల వారీగా నిధుల కేటాయింపు

రెండో దశలో 34 ఎస్సీ హాస్టళ్ల మరమ్మతులు చేసేందుకు రూ. 5.68 కోట్లు నిధులు విడుదల చేశారు. అందులో అనంతపురం డివిజన్‌లో నెం-1 ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహానికి రూ. 16.20 లక్షలు, నెం-2 ప్రీమెట్రిక్ బాలుర వసతిగృహానికి రూ. 17.4 లక్షలు, నెం-4 బాలుర ప్రీమెట్రిక్ వసతి గృహానికి రూ. 22 లక్షలు, ఉరవకొండలోని నెం-2 బాలికల వసతిగృహానికి రూ.17.5 లక్షలు, ఉరవకొండ బాలుర కాలేజీ వసతిగృహానికి రూ. 16 లక్షలు, ఉరవకొండ బాలికల నెం-1 వసతిగృహానికి రూ.17.5 లక్షలు, చాబాల గ్రామ ఎస్సీ బాలుర వసతిగృహానికి రూ.6.7 లక్షలు, ఉరవకొండలోని నెం-2 బాలుర వసతిగృహానికి రూ. 12 లక్షలు, గడేకల్లులోని బాలుర వసతిగృహానికి రూ. 13.5 లక్షలు, కొనకొండ్లలోని బాలుర వసతిగృహానికి రూ.13.61 లక్షలు, వజ్రకరూరులోని బాలికల వసతిగృహానికి రూ.17.78 లక్షలు, తాడిపత్రి డివిజన్‌కు సంబంధించి చుక్కలూరు బాలుర వసతిగృహానికి రూ.18 లక్షలు, తాడిపత్రి బాలికల కాలేజీ వసతిగృహానికి రూ. 28.56 లక్షలు, తాడిపత్రిలోని బాలికల ప్రీమెట్రిక్ వసతిగృహానికి రూ.17.5 లక్షలు, యాడికి బాలికల వసతిగృహానికి రూ.18.9 లక్షలు, దిమ్మగుడి బాలుర వసతిగృహానికి రూ. 13.1 లక్షలు, పెద్ద వడుగూరులోని బాలుర వసతిగృహానికి రూ.13.6 లక్షలు, గుత్తిలోని నెం-1 బాలుర వసతిగృహానికి రూ.14.55 లక్షలు, పామిడి బాలుర వసతిగృహానికి రూ.24.51 లక్షలు, గుత్తి బాలుర కాలేజీ వసతిగృహానికి రూ.17.4 లక్షలు, బుక్కరాయసముద్రంలోని బాలుర వసతిగృహానికి రూ. 20.80 లక్షలు, నార్పల బాలుర వసతిగృహానికి రూ. 19.09 లక్షలు, నార్పల బాలికల వసతిగృహానికి రూ. 19.61, తరిమెల బాలుర వసతిగృహానికి రూ. 22.38 లక్షలు, కళ్యాణదుర్గం డివిజన్‌లోని కళ్యాణదుర్గం నెం-1 బాలికల వసతిగృహానికి రూ. 11.42, కళ్యాణదుర్గం బాలుర కాలేజీ వసతిగృహానికి రూ.17.4 లక్షలు, కళ్యాణదుర్గం బాలికల కాలేజీ వసతిగృహానికి రూ.8.37 లక్షలు, కళ్యాణదుర్గం నెం-3 బాలుర వసతిగృహానికి రూ. 18.2 లక్షలు, కంబదూరు బాలుర కాలేజీ వసతిగృహానికి రూ. 17.38 లక్షలు, కళ్యాణదుర్గం నెం-2 బాలికల వసతి గృహానికి రూ. 13.86 లక్షలు, సోమలాపురం బాలుర వసతి గృహానికి రూ. 17.31 లక్షలు, రాయదుర్గంలోని బాలికల వసతిగృహానికి రూ.17.34 లక్షలు, బ్రహ్మసముద్రంలోని బాలుర వసతిగృహానికి రూ.14.30 లక్షలు చొప్పున మొత్తం 34 వసతి గృహాలకు రూ.5.68 నిధులు విడుదలయ్యాయి.


గుత్తిలో మరమ్మతులకు నోచుకున్న ఎస్సీ బాలుర వసతి గృహం

అన్ని హంగులతో...



జిల్లాలో ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు విరివిగా నిధులు విడుదలవుతున్నాయి. మొదటి విడతలో 10 హాస్టళ్ల, ఒక గురుకులానికి సంబంధించి రూ. 1.85 కోట్లు విడుదలవ్వగా... పనులు పూర్తి చేసి ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో ప్రారంభించాం. ప్రస్తుతం రెండో విడత కింద 34 హాస్టళ్లకు రూ. 5.68 కోట్లు నిధులు విడుదలయ్యాయి. త్వరలోనే అన్ని డివిజన్లలో అన్ని హాస్టళ్లకు మరమ్మతు పనులు పూర్తవుతాయి. అన్ని వసతిగృహాలు నూతన హంగులతో రూపుదిద్దుకోనున్నాయి.

- ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, డీడీ, ఎస్సీ వెల్ఫేర్

జిల్లాలో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మిస్తాం

క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేస్తాం

ఒక క్రీడ... ఒకే సంఘం.. అమలు చేస్తాం..

క్రీడారంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు


మాట్లాడుతున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన క్రీడాకారులకు నిలయమైన జిల్లాలో మల్టీపర్పస్ స్టేడియం నిర్మిస్తామనీ, ఇందుకు స్థల పరిశీలన చేస్తున్నామని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఇండోర్ స్టేడియంలో సోమవారం ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో క్రీడారంగాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. నూతన క్రీడాపాలసీని తీసుకువచ్చారని తెలిపారు. జిల్లాలో ఆర్డీటీ ఉండడం క్రీడాకారులకు వరమన్నారు. ఇలాంటి అవకాశం ప్రతి జిల్లాలో ఉండేలా ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఆర్డీటీ ముందుకువచ్చిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్రీడావికాస కేంద్రాలను పూర్తి చేసి, అన్ని వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా నుంచి వైసీపీ ప్రభుత్వం తరిమికొట్టిన సాయ్ కేంద్రాలు, అకాడమీలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 44వేల పాఠశాలలకు రూ.30వేలు చొప్పున రూ.18.5 కోట్లతో క్రీడాసామగ్రి అందజేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారన్నారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కోసం రూ.119కోట్ల నిధులు ఖర్చు చేయగా.. అందులో రూ.40కోట్లు దుర్వినియోగమైందన్నారు. దీంట్లో తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న సైకో రాజు, సజ్జల రామకృష్ణారెడ్డి, రోజా, అప్పటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై కచ్చితంగా కేసు నమోదు చేసి, నిధులు కక్కిస్తామని స్పష్టం చేశారు. అనంతరం డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, కోచ్‌లతో సమావేశమయ్యారు. క్రీడాకారులు, క్రీడా సంఘాలు, తల్లిదండ్రుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, ఫుట్‌బాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డీఎస్‌ఏ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, పీవీకేకే సుబ్బారావు పాల్గొన్నారు.

16న జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈనెల 16వ తేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి తెలిపారు. టోర్నీకి సంబంధించిన పోస్టర్లు సోమవారం ఇండోర్ స్టేడియంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు చేతుల మీదుగా విడుదల చేశారు. బుగ్గయ్యచౌదరి మాట్లాడుతూ.. వెటరన్ సింగిల్స్, డబుల్స్‌లో 35ప్లస్, 40ప్లస్, 45ప్లస్, 50ప్లస్, 55ప్లస్, 60ప్లస్ క్యాటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 14వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9966103956, 9703263984 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.14



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 11, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.19 వేలు



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 19వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ. 10,100తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 23 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గుర్తు తెలియని భయం

యల్లనూరులో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం?

ఇటీవల ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ

ఇది వారి పనేనని అనుమానం

రాత్రయితే దొంగల కోసం ప్రజల జాగరణ

యల్లనూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం ఉందని జోరుగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఒకేరోజు నాలుగు దొంగతనాలు జరగడంతో అనుమానం బలపడుతోంది. రెండు కాలనీల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించారని, గతంలో తాము ఎప్పుడు వారిని చూడలేదని స్థానికులు చెబుతుండటంతో మండలవాసుల్లో గుబులురేగుతోంది. గతనెల 19న యల్లనూరులో దేవర తర్వాత ఒకేరోజు నాలుగిళ్లల్లో చోరీలు జరిగాయి. దీంతో రాత్రిపూట ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు.



అయితే పోలీసులు ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతనెల 24న అర్ధరాత్రి సమయంలో ఎస్సీకాలనీలో పుల్లమ్మ, ప్రహ్లాద ఇంటిలో దొంగలు చొరబడి ఇంటిలో ఉన్న నగదుతోపాటు బంగారు ఆభరణాలు అపహరించారు. వెంటనే బీసీకాలనీలోకి ప్రవేశించిన దొంగలు మనోహర్ ఇంటి తాళాన్ని పగలగొట్టి చొరబడి ఇంటిలోని బంగారు వస్తువులతోపాటు మొత్తం రూ.65వేలకు పైగా విలువైన వస్తువులు ఎత్తుకువెళ్లారు. అక్కడి నుంచి యల్లనూరు- తాడిపత్రి ప్రధానరహదారిపై ఊతప్ప ఇంటిలోకి ప్రవేశించి బీరువాను పగలగొడుతుండగా ఇంటిపక్కన వారు గమనించి గట్టిగా అరవడంతో పారిపోయారు. నిత్యం ఈ రహదారిపై వాహనాలు తిరుగుతుంటాయి. అయినా కూడా దొంగలు నిర్భయంగా దొంగతనానికి ప్రయత్నించారంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

కొత్త వ్యక్తుల సంచారం?

యల్లనూరు గ్రామ దేవర సందర్భంగా కొత్త వ్యక్తులు మండలకేంద్రానికి చేరుకున్నట్లు సమాచారం. వీరు రాత్రి పూట ఇళ్లమీద పడి దొంగతనాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరు పగటి పూటఎవరికి అనుమానం రాకుండా ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తాచెదారం ఏరుకొంటూ రెక్కీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇళ్లకు తాళాలు వేసిన వాటిని గుర్తుపెట్టుకొని అర్ధ రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

జాగరణ చేస్తున్న ప్రజలు

ఒకేరోజు నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు జరగడంతో ప్రజలు రాత్రి పూట దొంగల భయంతో జాగరణ చేస్తున్నారు. పాతపేటలో బీసీకాలనీలో శనివారం రాత్రి ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు పరిగెత్తుకుంటూ వెళ్లారని, ఆ సమయంలో కాలనీవాసులు కేకలు వేస్తూ వారిని వెంబడించారు. అయినప్పటికి వారు పరారయ్యారు. కోటవీధిలో గత నెల 26న రాత్రి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి 12గంటల సమయంలో కనిపించారని చర్చించుకుంటున్నారు. దీంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా పహారా కాస్తున్నారు.

నిద్రమత్తు వీడని పోలీసులు

మండలకేంద్రంలో ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం నిద్రమత్తు వీడటం లేదు. సాధారణంగా అర్ధరాత్రి సమయంలో పోలీసు సిబ్బంది బీట్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఆ పని సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సిబ్బంది కొరత చూపుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ప్రచారం ఉంది. మండలానికి ఎస్‌ఐ స్థాయి అధికారి లేకపోవడంతో ఇక్కడ సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పోలీసు ఉన్నతాధికారులైనా చొరవచూపి దొంగల ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, రాత్రి సమయంలో గస్తీ ఏర్పాటు చేశామని సర్కిల్ సీఐ సత్యబాబు పేర్కొన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.



పుల్లమ్మ ఇంటిలోని బీరువాను పగలగొట్టిన దుండగులు (ఫైల్)

7 నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు


అథ్లెటిక్స్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సుధాకర్‌బాబు, సికిందర్ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పరుగు, స్పీడ్‌వాక్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 9502539888 నంబరులో సంప్రదించాలని కోరారు.

పిల్లల ఆరోగ్య సంరక్షణకే ఆల్బెండజోల్: కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్య సంరక్షణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వైద్యశాఖ ముద్రించిన జాతీయ నులిపురుగుల నివారణ దినం పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నులిపురుగులు కడుపులో ఉంటే పిల్లలు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, శారీరక, మానసిక ఎదుగుదలపైనా ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వీటి నివారణకు ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఏడాది నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆ తర్వాత వయసు వారికి పాఠశాలలు, కళాశాలల్లో పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పాల్గొన్నారు.

మళ్లీ ప్రైవేటుకే..

శివశంకర్ ఎంటర్ ప్రైజెస్‌కు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యతలు

కార్యాలయానికి రావద్దంటున్న ఆర్టీఏ అధికారులు


శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను మళ్లీ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత వారం రోజుల నుంచి ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలను నిలిపివేశారు. తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్‌ఎంఎస్) కేంద్రంలో ఫిట్‌నెస్ పరీక్షలు మొదలు పెట్టారు. గతేడాది సెప్టెంబరు నుంచే ఈ సంస్థకు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయాలకు బదులుగా అక్టోబరు నెలాఖరు దాకా ప్రైవేటు కేంద్రంలోనే వాహనాలకు పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఏజెన్సీల్లో ఫిట్‌నెట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతులు లేని కారణంతోనే గతేడాది నవంబరు మొదటి వారంలో ప్రైవేటు ఏజెన్సీల్లో పరీక్షలను తాత్కాలికంగా నిలిపేశారు. అప్పటి నుంచి జనవరి 25వతేదీ వరకు ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఆర్థిక శాఖ అనుమతులు మంజూరైన నేపథ్యంలో ప్రైవేటు ఏజెన్సీకి తిరిగి ఫిట్ నెట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీంతో గత వారం రోజుల నుంచి జాతీయరహదారి నుంచి అయ్యవారిపల్లికి వెళ్లే దారిలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ కేంద్రంలో వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

చలానా కట్టిన వాహనదారులకు నిరాశే..!

జనవరి 25దాకా జిల్లాలోని 62 మంది తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పరివాహన్ సైట్‌లో చలానా కట్టారు. ఆయా వాహనదారులు సంబంధిత ఆర్టీఏ కార్యాలయాలకు తమ వాహనాలను తీసుకువెళ్లగా ఇక్కడ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పరీక్ష చేయరని, తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ కేంద్రానికి వెళ్లాలని సమాధానం ఇస్తున్నారు. దీంతో వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పరివాహన్‌లో ఎఫ్‌సీ కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి కట్టిన చలానా డబ్బులు వెనక్కి ఇస్తామని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.


వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించే పరికరాలు

ప్రైవేటు కేంద్రానికి వెళ్లాల్సిందే..

అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఆర్టీఏ కార్యాలయ పరిధిలోని అన్ని రకాల వాహనాలకు ఇదివరకు ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేవారు. ప్రభుత్వం వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను తిరిగి ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో ఇక నుంచి జిల్లాలోని అన్ని రకాల వాహనదారులు జిల్లా కేంద్రం సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ కేంద్రానికి వెళ్లాల్సిందే. అక్కడ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్‌ఎంఎస్) ద్వారా 15 రకాల పరికరాలతో వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తామని ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా పరీక్షల్లో వాహనం ఫిట్‌గా ఉన్నట్లు నిర్ధారణ అయితేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఇప్పటి నుంచి ప్రైవేటు ఏజెన్సీ కేంద్రంలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల కోసం vahan.parivahan.gov.in.AFMS సైట్‌లో చలానాలు కట్టాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.


వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష చేసే ట్రాక్

చలానా డబ్బులు రీఫండ్ చేస్తాం



వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ, సర్టిఫికెట్ జారీ బాధ్యతలను తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీకి అప్పగించారు. జనవరి 27 నుంచి తిరిగి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యత ఏజెన్సీకి వెళ్లింది. వాహనదారులు ఇక నుంచి ఆర్టీఏ కార్యాలయాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం రావాల్సిన అవసరం లేదు. జిల్లాలోని అన్ని రకాల వాహనాలను ఫిట్‌నెస్ పరీక్ష కోసం ప్రైవేటు ఏజెన్సీ కేంద్రానికి తీసుకువెళ్లాలి. జనవరి 25 దాకా పరివాహన్ సైట్‌లో చలానాలు కట్టిన వారికి ప్రభుత్వం ఆ డబ్బులను రీఫండ్ ఇస్తుంది. ఆయా వాహనదారులు పేమెంట్ రసీదు, వాహన యమాని బ్యాంక్ పుస్తకం, ఆర్‌సీ, ఆధార్ జిరాక్స్‌లతోపాటు అర్జీని అనంతపురం డీటీసీ కార్యాలయంలో సమర్పించాలి. ఆయా అర్జీలను కమిషనరేట్‌కు పంపించి, కట్టిన డబ్బులను రీఫండ్ అయ్యేలా చూస్తాం.

-వీర్రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

ఎస్సీ మహిళల కోసం పీఎంఏజేఏవై

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య


సమావేశమైన డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని దళిత మహిళల జీవనోపాధుల పెంపునకు ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై)ను ప్రవేశపెట్టినట్లు డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక బుడ్డప్పనగర్‌లోని ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో సోమవారం పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. అర్హులైన మహిళలు పథకం కింద రూ.1 లక్ష నుంచి రూ.3లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణం పొందవచ్చన్నారు. ఇందులో సభ్యులు 10శాతం వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉన్నతి యూనిట్ ద్వారా తీసుకున్న వడ్డీలేని రుణానికి 50 శాతంగానీ, రూ.50వేలుగానీ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, ఏపీఎం మంజుల, ఉన్నతి సభ్యులు పాల్గొన్నారు.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొలమ్...

భీమ్‌సేన్ జోషి (జయంతి)



అత్యున్నతమైన 'భారతరత్న' అందుకున్న తొలి హిందూస్తానీ శాస్త్రీయ సంగీత కళాకారుడు పండిట్ భీమ్‌సేన్ గురురాజ్ జోషి 1922 ఫిబ్రవరి 4న (గతంలో ధారవాడ జిల్లా) గదగ్ జిల్లా రోణ తాలూకాలో జన్మించారు. గురువు సవాయి గంధర్వ వద్ద శిష్యుడిగా చేరి 'కిరానా ఘరానా' శైలిలో ఖయాల్ గానంలో పేరొందారు. భజనలు, అభంగాలు పాడడంలో సిద్ధహస్తులు. న్యూయార్క్‌లో కచేరీ ఇచ్చిన తొలి భారతీయ సంగీతకారులు. కర్ణాటక రత్న, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్, మహారాష్ట్ర భూషణ్, సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ తదితర పురస్కారాలు పొందారు. జాతీయ ప్రతిపత్తిపై రూపొందించిన సంగీతపరమైన వీడియో 'మిలే సుర్ మేరా తుమారా...' ఎంతో ప్రసిద్ధి చెందింది. గురువు సవాయి గంధర్వ జ్ఞాపకార్థం ఏటా పూనెలో సంగీతోత్సవం నిర్వహించేవారు. 2011 జనవరి 24న కన్నుమూశారు. పూనెలో రాష్ట్ర గౌరవాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

బిర్జూ మహరాజ్ (జయంతి)



కథక్ నాట్య కళాకారుడు, 'పద్మ విభూషణ్' గ్రహీత బిర్జూ మహరాజ్ 1938 ఫిబ్రవరి 4న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవ్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు బిర్జూ మోహన్‌నాథ్ మిశ్రా. తండ్రి, మేనమామల ప్రోత్సాహంతో కథక్ నాట్య కళాకారుడిగా రాణించారు. చిన్నతనం నుంచి నాట్యంపై మక్కువ ఉన్నా హిందూస్తానీ గాత్రంలో కూడా ఆరితేరారు. కథక్ నాట్యానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చారు. సంగీత నాటక అకాడమీలో ప్రధాన నాట్యాచార్యుడిగా వ్యవహరించారు. దేశ విదేశాల్లో వేలాది నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్ర రత్న, నృత్య చూడామణి, కాళి దాస్ సమ్మాన్ తదితర పురస్కారాలు సహా గౌరవ డాక్టరేట్ పొందారు. 2022 జనవరి 17న కన్నుమూశారు.

మునిమాణిక్యం నరసింహారావు (వర్ధంతి)



ప్రముఖ తెలుగు కథకుడిగా పేరొందిన మునిమాణిక్యం నరసింహారావు 1898 మార్చి 15న తెనాలి తాలూకా సంగం జాగర్లమూడిలో జన్మించారు. కుటుంబ జీవితంలో కష్టసుఖాలు, దాంపత్య జీవితంలో సౌందర్యం ఆయన కథల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన సృష్టించిన 'కాంతం కథలు' తెలుగు కథా సాహిత్యంలో ఒక మణిపూస. కాంతం కథలకి ఆయన భార్య ప్రేరణ, స్ఫూర్తి. నిజజీవితంలో దాంపత్య సన్నివేశాలు, చిన్నసంఘటనల ఆధారంగా చేసుకుని రాసినవి. కేవలం హాస్య రచయిత మాత్రమే కాదు హాస్యోపాసకులు కూడా. 1973 ఫిబ్రవరి 4న కన్నుమూశారు.

పద్మా సుబ్రహ్మణ్యం (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత పద్మా సుబ్రహ్మణ్యం 1943 ఫిబ్రవరి 4న మద్రాస్‌లో జన్మించారు. భరత నాట్య కళాకారిణి, పరిశోధకురాలు, కొరియోగ్రాఫర్, స్వరకర్త, సంగీత దర్శకురాలు, ఉపాధ్యాయిని, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. పలు దేశాలలో పర్యటించి భరతనాట్యానికి వన్నె తెచ్చారు. జపాన్, ఆస్ట్రేలియా, రష్యా వంటి దేశాలలో ఆమె గౌరవార్థం లఘు చిత్రాలు రూపొందించబడ్డాయి. నృత్యం, నాట కాలలో ఏకపాత్రాభినయం చేయడం ప్రత్యేకత. పద్మశ్రీ, కలైమామణి తదితర పురస్కారాలు పొందారు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ కారాగారశిక్ష

దొడ్డబళ్లాపుర, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్లాపుర పట్టణంలోని ఇస్లాంపుర నివాసి ఉపేంద్రను దారుణంగా హతమార్చి మొండెం వేరు చేసిన కేసులో నిందితుడు తాలూకాలోని రాజఘట్టె నివాసి పవన్ అలియాస్ పులి (21)కు కఠిన యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2లక్షల జరిమానా విధిస్తూ నాల్గో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. 2018లో పట్టణంలోని డి క్రాస్ సమీపాన ఉపేంద్ర మొండెం లభించింది. ఘటన వెలుగుచూసిన 24 గంటల్లో నిందితుడు పవన్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిద్ధరాజు, అప్పటి ఎస్సై బీకే పాటిల్‌లు అరెస్టు చేశారు. అనంతరం కోర్టుకు చార్జిషీట్ సమర్పించారు. రెండు రౌడీ గ్యాంగ్‌లు తమ ప్రాబల్యం చాటుకోవడానికి ఇలా వ్యవహరించినట్టు దర్యాప్తులో రుజువైంది. జిల్లా సెషన్స్ న్యాయమూర్తి రమేశ్ దురుగప్ప ఏకబోటి సోమవారం తీర్పును ప్రకటించారు.

మహిళ ఆత్మహత్య



అపర్ణ(ఫైల్)

పావగడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వివాహమై ఇద్దరు పిల్లలున్న మహిళను అదే గ్రామానికి చెందిన వ్యక్తి తనను ప్రేమించాలని వేధించడంతో, పరువుకోసం అపర్ణ(26) అనే మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన క్యాతగానిచెరువు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మధుగిరి డీవైఎస్పీ మంజునాథ్, తిరుమణి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన మేరకు వళ్లూరు గ్రామానికి చెందిన అపర్ణ, క్యాతగానిచెరువుకు చెందిన నరసింహతో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. అదే గ్రామానికి చెందిన రామాంజినరెడ్డి అనే వ్యక్తి ఆమెను తరచూ తన ఫోన్‌నంబరు ఇచ్చి ఫోన్‌చేయాలని వేధిస్తుండేవాడన్నారు. దీనిపై తన భర్త పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో వారు రామాంజినరెడ్డిని మందలించారన్నారు. ఆదివారం రాత్రి అపర్ణ ఇంటికి రామాంజినరెడ్డి వెళ్లి తన విషయం అందరికీ చెప్పావని తనను ప్రేమించకపోతే నిన్ను, నీభర్తను చంపుతానని బెదిరించాడని అపర్ణ తన భర్త దృష్టికి తీసుకెళ్లింది. ఉదయం ఈ విషయంపై మాట్లాడదామని శివమాల ధరించిన నరసింహులు తెలిపాడన్నారు. సోమవారం తెల్లవారుజామున ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భార్య మరణానికి రామాంజినరెడ్డి బలవంతమే కారణమని నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు డీవైఎస్పీ తెలిపారు.

పాత్రికేయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- సమస్యల పరిష్కారానికి కట్టుబడిన ప్రభుత్వం
- మీడియా అకాడమీ పురస్కారాల ప్రదానోత్సవంలో డీసీఎం



పురస్కారాల ప్రదానోత్సవంలో డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సమాజంలో అణగారినవర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని డీసీఎం డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి మీడియా అకాడమీ పురస్కారాలను నగరంలో సోమవారం ప్రదానం చేశారు. జేఎన్ టాటా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషాఖానం అధ్యక్షత వహించగా సీఎం మీడియా సలహాదారుడు ప్రభాకర్, సమాచారశాఖ కమిషనర్ హేమంత్ నింబాళ్కర్, సమాచారశాఖ కార్యదర్శి బి.బి.కావేరిలు ముఖ్యులుగా పాల్గొన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాధ్యంకాని గ్రామీణ ప్రాతికేయులకు బస్‌పాస్‌లను ఇటీవలే మంజూరు చేశామన్నారు. మీడియారంగం సమాజంలో కీలకమైనదన్నారు. సమాజాన్ని దారి తప్పించేలా మారుతున్న సోషల్‌మీడియాను కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాత్రికేయులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని నిర్ణయించామని త్వరలోనే అమలు చేస్తామన్నారు. 2023 సంవత్సరానికి జీవనసాఫల్య పురస్కారాన్ని అ.చ.శివణ్ణకు, 2024కు అబ్దుల్ సలాం పుత్తిగెకి ప్రదానం చేశారు. ఏడాదికి 28మంది చొప్పున పురస్కారాలను ప్రదానం చేశారు. పాత్రికేయులతోపాటు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

యువజనమేళాను పునరుద్ధరించండి



వినతిపత్రం అందజేత

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): యువజనులు క్రీడాశాఖ ఆధ్వర్యంలో యువతకోసం చేపట్టిన యువజన మేళా, యువజనుల సమావేశాల కార్యక్రమాలను పునరుద్ధరించాలని జాతీయ యువ పురస్కార గ్రహీత డాక్టర్ చిన్నప్ప వై చిక్కహాగడె డిమాండ్ చేశారు. గ్రామీణ యువ ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడే ఈ కార్య క్రమాలను ఐదేళ్లుగా నిలిపివేశారన్నారు. సోమవారం యువజనులు, క్రీడాశాఖ కార్యదర్శి రణదీప్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2025 బడ్జెట్‌లో ఈ కార్యక్రమాలను చేర్చడం ద్వారా యువతకు అండగా నిలవాలన్నారు. ఏటా తాలూకా స్థాయిలో యువజన మేళాల ద్వారా జానపదం, నృత్యం, కోలాటం, గీగిపదాలు, ఏక పాత్రాభినయం, భజనలు, వీరగాసె, రంగగీతె వంటి గ్రామీణ కళలను నిర్వహించేవారన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించడం ద్వారా యువత ప్రతిభకు అవకాశాలు దక్కేవన్నారు.

అయితే ఐదేళ్లుగా ఈ కార్యక్రమాలు నిర్వహించలేదని ప్రస్తుత బడ్జెట్‌లో అవకాశం కల్పించాలని కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ డీ శోభా, మాగనహళ్ళి మంజునాథ్ దావణగెరె, ఎం నాగవేణి, రాయప్ప, బీదర్‌కు చెందిన ఓంప్రకాశ్ రొట్టె, కాసరవాడి మహదేవ తదితరులు ఉన్నారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులను నియంత్రించండి



తహసీల్దారు కార్యాలయం వద్ద ప్లకార్డులతో మహిళల నిరసన

బాగేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వల్పరుణాలు ఇచ్చే మైక్రో ఫైనాన్స్ సంస్థలు రుణాల రికవరీ వేళ మహిళలకు వేధింపులు అధికమయ్యాయని వెంటనే నియంత్రించాలని జనవాది మహిళాసంఘం డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో బాధిత మహిళలు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. తహసీల్దారు మనీషా ఎస్ మహేశ్‌పత్రికి వినతిని సమర్పించారు. సంఘం మహిళా సంచాలకులు సావిత్రమ్మ మాట్లాడుతూ మహిళలనుంచి బలవంతంగా రుణాలు వసూలు చేస్తూ వేధిస్తున్నారని అలాంటి సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐఎం ముఖ్యుడు చన్నరాయప్ప మాట్లాడుతూ సంస్థల వ్యవహారాలలో పారదర్శకత పాటించేలా నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి మహిళలకు కనీసం రూ.5లక్షల వరకు రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖులు సోమశేఖర్, మహిళా బాధితులు సి ఉమా, అనితా, సరితా, లక్ష్మీనరసమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు ప్రేమాభిమానాలు పంచాలి

ముళబాగిలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలోనూ బాలిక పాత్ర ఎంతో కీలకమని, బాలికకు ప్రేమాభిమానాలు, గౌరవం ఇవ్వాలని చన్నాపుర ప్రభుత్వ కన్నడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీఎస్ కవితా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ముత్యాలపేట టీచర్ ఎన్‌సి రాజేశ్వరి నివాసంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని చుటుకు సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'బాలిక ప్రతి ఇంటికి నవ్వు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్వామి వివేకానంద చికాగో సమ్మేళనంలో తన ప్రసంగంతో భారతీయ సంస్కృతి సంప్రదాయాలను చాటారన్నారు. విదేశాలలో పర్యటించినవేళ మహిళలు షేక్ ఇచ్చేందుకు ప్రయత్నించగా రెండుచేతులతో నమస్కరించడం ద్వారా మన గౌరవాన్ని నిలిపారన్నారు. చుటుకు సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షురాలు కిన్నరి ఎన్‌సీ రాజేశ్వరి మాట్లాడుతూ వేదాలు, మహాకావ్యాలైన రామాయణం, మహాభారతం సహా గ్రంథాలలో బాలికలు, మహిళలపట్ల ఎంతో గౌరవంగా పేర్కొన్నారన్నారు. నేటి తరం మహిళలు వంటింటికే పరిమితం కాకుండా విద్య, విజ్ఞానం, సాంకేతిక రంగాలలోనూ ముందంజలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో బాలికలు చంద్రికా ప్రియ, యాస్మిత, చాద్విక్, చాద్వరి సహా కన్నడ బెళగు వేదిక అధ్యక్షుడు అత్తికుంటె సుబ్రమణి, చుసాప ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, సహకార్యదర్శి శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ బాలికాదినోత్సవంలో టీచర్ రాజేశ్వరి తదితరులు

ఆరోగ్యంపై దృష్టి సారించండి



శిబిరంలో ప్రసంగిస్తున్న నిర్వాహకుడు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యం కోసం శిబిరాలు ఏర్పాటు చేశామని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ గ్రామీణ అధ్యక్షుడు సీకల్ ఆనందేగౌడ తెలిపారు. పట్టణంలోని వాసవి విద్యాసంస్థ ఆవరణలో ముత్తి అండ్ కేర్ స్మైల్ ఆసుపత్రి, సీకల్ రామచంద్ర గౌడ ఫౌండేషన్, ఆర్‌సిజి ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ సహకారంతో పైల్స్ పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి, ఆహార పద్ధతులు, తగిన శ్రమ లేకపోవడంతో పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. శిబిరంలో చుట్టుపక్కల ప్రాంతాల వారు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డప్పు కళా కారుడు పిండపాపనహళ్ళి మునివెంకటప్ప, స్మైల్ ఆసుపత్రి డాక్టర్ పరమేశ్వర్‌లు శిబిరాన్ని ప్రారంభించారు. వాసవి విద్యాసంస్థ కార్యదర్శి రూపసి రమేశ్, ఆర్యవైశ్యమండలి అధ్య క్షుడు టీపీ కృష్ణశెట్టి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మరో 20 ఏళ్లకు ప్రతి భారతీయుడికీ క్రీడల్లో భాగస్వామ్యం: స్మృతి మంధాన



నివేదిక విడుదలలో మహిళా క్రికెటర్ స్మృతి మంధాన తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ ఫార్వర్డ్ దేశమే ప్రధానమని ఉమెన్ ప్రీమియర్ లీగ్, ఆర్‌సీబీ క్రికెటర్ స్మృతి మంధాన అభిప్రాయపడ్డారు. ఇండియన్ స్పోర్ట్స్ ప్రగతికి వాణిజ్య, సాంకేతిక పరిణామం, కార్యదక్షత ముఖ్యమని నివేదిక విడుదల చేశారు. ఆర్‌సీబీ, స్పోర్ట్స్ అండ్ సొసైటీ యాక్సిలేటర్ నివేదికను రూపొందించాయి. స్పోర్ట్స్ ఫార్వర్డ్ నేషన్ అనేది భారతీయ క్రీడలకు సంబంధించి లాభాలు, విధానాలను రూపొందిస్తుంది. వాణిజ్యపరంగా లాభదాయకమైన క్రీడాపోటీలవైపు దృష్టి సారించేలా పలు అధ్యయనం చేయనున్నారు. ఉమెన్ ప్రీమియర్‌లీగ్ అనేది ఇటీవల ఆదరణ పొందుతోందని, ఆర్‌సీబీ కేప్టెన్ ఇండియన్ స్పోర్ట్స్ అభివృద్ధిలో ఆర్‌సీబీ మరింత బలోపేతం కానుందనేలా నివేదిక సిద్ధమైందని స్మృతి మంధాన అభిప్రాయపడ్డారు. ఆర్‌సీబీతో కలసి ఈ విభాగంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. 2047 నాటికి ప్రతి భారతీయుడి జీవితంలో క్రీడలు ఒక భాగమనే ఉమ్మడి నమ్మకం రానుందన్నారు. 2047 లక్ష్యంగా రోడ్‌మ్యాప్‌లో ప్రధానంగా స్థిరమైన బ్లూప్రింట్ విధానం, ప్రతిభా మార్గాల సృష్టి, అధికపనితీరు వ్యూహం, నియంత్రణ సామర్థ్యం, స్పోర్ట్స్ టెక్నాలజీ, ప్రైవేట్ భాగస్వామ్యం, ఆర్థిక ప్రాయోజకులు, సమగ్ర అభివృద్ధి, సమర్థ నిర్మాణం వంటి అంశాలు పొందుపరిచారు. ఈ అంచనాల నివేదికను ఆర్‌సీబీ ఇన్నోవేషనల్ ల్యాబ్, ఇండియన్ స్పోర్ట్స్ సమ్మిట్‌కు మార్చి 14న బెంగళూరులో జరిగే సమీక్షలో సమర్పించనుందన్నారు. కార్యక్రమంలో ఇతర క్రికెటర్‌లు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



కార్యాచరణలో పురసభ ఆరోగ్య అధికారి గోవిందరాజు

బంగారపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బంగారపేట పట్టణంలో పలుమార్లు ఫుట్‌పాత్ ఆక్రమణలకు సంబంధించి హెచ్చరికలు జారీ చేసినా తరచూ ఆక్రమణలకు గురి అవుతున్న నేపథ్యంలో పురసభ అధ్యక్షుడు గోవింద, ముఖ్య అధికారి సత్యనారాయణ ఆదేశాలతో పురసభ ఆరోగ్య అధికారి గోవిందరాజు స్వయంగా కార్యాచరణ చేపట్టారు. సోమవారం ఉదయం పట్టణవ్యాప్తంగా దుకాణాల వద్ద తనిఖీలు చేసి ఫుట్‌పాత్‌పై ఉంచిన వస్తువులను తొలగించేలా చేశారు. పూలు, పండ్ల వ్యాపారులతోపాటు కొన్ని హోటళ్లు, దుకాణాలు ఫుట్‌పాత్‌ను ఆక్రమించాయన్నారు. మరికొన్నిచోట్ల రోడ్డుపై ఇష్టం వచ్చినట్టు వాహనాలను పార్కింగ్ చేసినట్టు గుర్తించి తొలగించామని గోవిందరాజు తెలిపారు. గతనెలలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై పలు ఫిర్యాదులు వచ్చాయని పలువురికి సూచించినా తాత్కాలికంగానే ఉండడంతో కార్యాచరణ నిర్వహించామన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పరిగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జయమంగళి నది తీర ప్రాంతంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి మూడో షష్ఠి సందర్భంగా దివ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన, దేవతల ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపారు. పూజలకు పెద్దఎత్తున భక్తాదులు తరలివచ్చారు. కార్యక్రమంలో వడ్డె హనుమయ్య, మూర్తి, శివ, చౌడప్ప, భక్తులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని పసరవక్కురి వద్దున వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు పంచాంగం శేషప్పస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

బెంగళూరుకు మరో ఎయిర్‌పోర్ట్ అవసరం

- రాజ్యసభలో మాజీ ప్రధాని దేవెగౌడ



రాజ్యసభలో దేవెగౌడ

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరానికి మరో విమానాశ్రయం అవసరమని మాజీ ప్రధాని దేవెగౌడ ప్రస్తావించారు. రాజ్యసభలో సోమవారం ప్రశ్నోత్తరాలవేళ దేవెగౌడ జోక్యం చేసుకుని కర్ణాటక అభివృద్ధి దృష్ట్యా బెంగళూరుకు విమానాశ్రయానికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం దేవనహళ్ళిలోని కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌పై ఒత్తిడి పెరుగుతోందని ఏటా ప్రయాణీకుల సంఖ్య గణనీయం అవుతోందని భవిష్యత్తులో సరళీకృతమైన ప్రయాణాలకు అనుకూలంగా మరో విమానాశ్రయం కల్పించాలని కోరారు. అందుకు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహననాయుడు జోక్యం చేసుకుని కర్ణాటక ప్రభుత్వం స్థలాన్ని గుర్తిస్తే మరో విమానాశ్రయం మంజూరుకు అనుమతులు ఇస్తామని సమాధానం ఇచ్చారు.

30 ఏళ్లలో కేన్సర్ కేసులు రెట్టింపు

- పొగాకుతో శ్వాసకోశ, నోటికేన్సర్ : డాక్టర్ రాధేశ్యామ్‌నాయక్

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ దశాబ్దాలకాలంగా ఉన్నా కేసుల సంఖ్య తక్కువగా ఉండేదని ఇటీవలి 30ఏళ్లలో రెండింతలు పెరిగాయని సంప్రద ఆసుపత్రి మెడికల్ అంకాలజిస్ట్ రాధేశ్యామ్‌నాయక్ అభిప్రాయపడ్డారు. కేన్సర్ డేలో భాగంగా సోమవారం వర్చువల్ రూపంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 1990లో పోల్చితే ప్రస్తుతానికి కేన్సర్ రెండింతలు పెరగడం విచారకరమన్నారు. ప్రపంచంలో భారత్ కేన్సర్ రాజధానిగా మారిందని విచారం వ్యక్తం చేశారు. కేన్సర్ పెరిగేందుకు ధూమపానం, మద్యపానం, నాణ్యమైన ఆహారం తీసుకోకపోవడం, స్థూలకాయం, వ్యాయామం కొరత ఇతర కారణాలు ఉన్నాయి. పొగాకుతో శ్వాసకోశ, నోటి, గొంతు కేన్సర్ పెరుగుతోందని 40శాతం కేసులు ఇవే ఉన్నాయన్నారు. మహిళల్లోనూ కేన్సర్ పెరుగుతోందని పేర్కొంటూ ప్రతి లక్ష మంది మహిళల్లో 105మందికి, పురుషుల్లో 95మందికి ప్రభావం చూపుతోందన్నారు. ప్రివెంటివ్ అంకాలజిస్ట్ వినోద్ అభిప్రాయం ప్రకారం వ్యాధిని గుర్తించడం జాప్యం జరుగుతోందని ఇదే తీవ్ర పరిణామాలకు కారణమవుతోందన్నారు. రోగ నియంత్రణ పెను సవాల్‌గా మారుతోందన్నారు. జీవనశైలిలో మార్పులు, పొగాకు, ఆల్కహాల్ వంటివాటికి దూరంగా ఉండడంతోపాటు అనుమానం ఉంటే నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించుకుంటే కేన్సర్ నుంచి బయటపడవచ్చునన్నారు.

పికెల్‌బాల్ విజేత బెంగళూరు జట్టు

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ పికెల్‌బాల్ లీగ్‌లో బెంగళూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. ముంబైలో జరిగిన ఫైనల్స్‌లో పూనె యునైటెడ్ జట్టుపై 3-1 స్కోరుతో బెంగళూరు జవాన్స్ జట్టు విజేతలుగా నిలిచారు. వరల్డ్ పికెల్‌బాల్ లీగ్ తొలి ఫ్రాంఛైజీ ఆధారిత ఎడిషన్‌లో వీరు ఛాంపియన్‌గా నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో జాగ్ పోస్టర్ 26/8 ఆధిపత్యం సాధించగా మహిళల డబుల్స్ విభాగంలో ట్రాన్‌ఫ్యూన్ మెక్లియన్, ఆల్‌జెంద్రా బోరోబియా 13-9 స్కోరుతో విజయం సాధించారు. చాంపియన్‌లుగా నిలవడంపై స్టీవర్డ్ మాట్లాడుతూ పదిరోజులపాటు పికెల్‌బాల్ టోర్నీ క్రేజీ జరిగిందని, ఇలా ఇంతటి ఆదరణ లభిస్తుందని నమ్మలేదన్నారు. ఆదివారం ముంబైలో టోర్నీ జరగగా సోమవారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు.



ట్రోఫీతో బెంగళూరు జట్టు ఉత్సాహం

నేహా హత్య వెనుక ఓ ఎమ్మెల్యే హస్తం

- తండ్రి ఆరోపణ

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో కళాశాల విద్యార్థిని నేహా దారుణ హత్య వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని తండ్రి నిరంజన్ హిరేమఠ్ ఆరోపించారు. సోమవారం హుబ్బళ్ళిలో మీడియాతో మాట్లాడుతూ నాలుగు నెలల్లో హత్య కేసును తేలుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని అయితే పది నెలలు ముగిసినా ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. నేహా హత్య వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని, సీబీఐ ద్వారా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, కుమార్తె ఆత్మకు శాంతి లభిస్తుందన్నారు. 2024 ఏప్రిల్ 18న హుబ్బళ్ళి విద్యానగర్‌లోని బీవీబీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని నేహాను గొంతుకోసి హత్య చేసిన విషయం దేశవ్యాప్తంగా సంచలనమైంది. నేహా తండ్రి కాంగ్రెస్ కార్పొరేటర్‌గా వ్యవహరించినవారు. నేహా హంతకుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. అయితే కళాశాలలో అడ్మిషన్ యథావిధిగా కొనసాగడంపై వారం రోజులక్రిందట స్థానికులు ఆందోళన చేయడంతో కళాశాల యాజమాన్యం వెంటనే నిందితుడు ఫయాజ్‌ను సస్పెండ్ చేసింది. ఈకేసును హుబ్బళ్ళి కాకుండా మరో కోర్టుకు తరలించాలని నిరంజన్ హిరేమఠ్ డిమాండ్ చేశారు.


గ్రామీణ యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

- మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడలలో మన యువతకు ఉత్తమ నైపుణ్యం ఉందని వారిని ప్రోత్సహించేలా గ్రామీణ క్రీడలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి అరవింద లింబావళి పేర్కొన్నారు. హరాడి స్పోర్ట్స్ క్లబ్‌లో కబడ్డీపిళ్ళప్ప, బృందం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి మహిళల ఫ్లడ్‌లైట్ కబడ్డీ పోటీలలో పాల్గొని మాట్లాడారు. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ జాతీయస్థాయి ప్రమాణాలతో క్రీడామైదానాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. యువత కూడా యోగా, వ్యాయామం సహ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా చక్కటి ఆరోగ్యంగా ఉండేందుకు సాధ్యమవుతుం దన్నారు. నియోజకవర్గంలోని గుంజూరు, హరాడి, మండూరు, దొడ్డ కన్నల్లిలలో ఇప్పటికే క్రీడా మైదానంలో నిర్మించామని, ప్రతి వార్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో 16 జిల్లాలనుంచి జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో దక్షిణకన్నడ జిల్లా ప్రథమస్థానంలో నిలిచి ట్రోఫీ, నగదు బహుమతి పొందింది. హావేరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. విజేతజట్లను మాజీ మంత్రి లింబావళి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ హోబళి అధ్యక్షుడు హరాడి పిళ్ళప్ప, పట్టణ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ముఖ్యులు మనోహర్‌రెడ్డి, నటరాజ్, రాంపుర గణేశ్, కిత్తగనూరు నాగరాజ్, కణ్ణూరు అశోక్, సతీశ్, లక్ష్మీనారాయణ, వార్డు అధ్యక్షుడు పవన్‌రెడ్డి, యువ నాయకులు పవన్‌శెట్టి, విజయ్ గౌడ, బుల్లెట్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుల జట్టుతో మాజీ మంత్రి లింబావళి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

లాభాలు పండుతున్నాయ్..!

● సిరులు కురిపిస్తున్న దానిమ్మ సాగు ● కిలో రూ.250 వరకు ధర ● బళ్ళారి పండ్లకు ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్



బాక్సుల్లో ప్యాక్ చేసేందుకు సిద్ధంగా ఉంచిన దానిమ్మ పండ్లు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దానిమ్మ సాగు చేసే మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ సారి ఏర్పడిన తుపాన్లు, అకాల వర్షాల కారణంగా దానిమ్మ దిగుబడి తగ్గిపోయింది. దీంతో పాటు కర్ణాటక రైతు పంట పండింది. రాష్ట్రంలో దానిమ్మ సాగు చేసే జిల్లాలో బీజాపూర్, బాగల్‌కోట, బళ్ళారి, కొప్పళ జిల్లాలో అధికంగా దానిమ్మ సాగు చేస్తారు. ఈ ఏడాది దానిమ్మ రైతులకు లాభాలు సిరులు కురిపిస్తున్నాయి. సరైన సమయంలో వ్యవసాయ విజ్ఞానులు, ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలతో దానిమ్మ సాగు చేసి మంచి దిగుబడి సాధించామని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బళ్ళారి జిల్లా పరిధిలో సండూరు, కంప్లి, కురుగోడు ప్రాంతాల్లో దానిమ్మ పంటను ఎక్కువగా రైతులు సాగు చేశారు. హెక్టారు దానిమ్మ సాగుచేయడానికి రూ 2 నుండి 3లక్షల రూపాయల వరకు ఖర్చు వస్తుందని, రోగాల నియంత్రణ, కీటకాల బాధ నుంచి దానిమ్మను కాపాడుకుంటే రూ 20 నుంచి 25 టన్నుల దిగుబడి పొందవచ్చు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కిలో దానిమ్మ ప్రస్తుతం మార్కెట్‌లో క్వాలిటీ బట్టి రూ.80 నుంచి రూ.100 లాభం వచ్చినా హెక్టారుకు 20లక్షల నుంచి 25లక్షల వరకు ఆదాయం పొందవచ్చని దానిమ్మ సాగు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి దిగుబడి రాష్ట్రంలో 40శాతం తగ్గిందని, తద్వారా బెంగళూరు, హైదరాబాద్, చైన్నై మార్కెట్‌లో కిలో దానిమ్మ రూ.190 నుంచి రూ 250లు వరకు పలుకుతున్న కారణంగా జిల్లాలో పండించిన దానిమ్మకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. బళ్ళారి జిల్లా పరిధిలో సుమారు 750 హెక్టార్ల దానిమ్మ సాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారులు చెబుతుండగా, కంప్లి, కురుగోడు, బళ్ళారి తాలూకా పరిధిలోని పలు గ్రామాల్లో 500 హెక్టార్లకు పైగా దానిమ్మ సాగు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది దానిమ్మ ధర కిలో రూ 80 నుంచి రూ.100 పలుకుతుండగా, దానిమ్మ దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో దానిమ్మకు మంచి డిమాండ్ రావడంతో ఈ సారి రైతులు దానిమ్మ సాగునైపు మొగ్గుచూపుతున్నారు. దానిమ్మ పంట విస్తీర్ణం పెంచడానికి సాగు రైతులకు జాతీయ ఉద్యానవన మిషన్ నుంచి ప్రోత్సాహం అందిస్తున్నామని ఉద్యానశాఖ అధికారులు తెలుపుతున్నారు.



విరగ్గాసిన దానిమ్మ

జిందాల్‌లో గ్యాస్‌పైప్ లీక్..!

● ముగ్గురు కార్మికులకు గాయాలు
● మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలింపు



జిందాల్‌లోని ఎనర్జీ ప్లాంట్

తోరణగల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిందాల్ ఫ్యాక్టరీ థర్మల్ ఎనర్జీ ప్లాంట్‌లో శనివారం స్టీమ్ గ్యాస్ లీకైన పేలిన ఘటనలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదంలో ప్రేమచంద్ర, ముఖేష్ యాదవ్, నిఖిల్ కుమార్‌కు 70శాతం శరీరం కాలిన గాయాలయ్యాయి. గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం ముంబైకి తరలించినట్లు తెలిసింది. వీరిలో సుశీల్ కుమార్ అనే కార్మికుడికి 10శాతం శరీరంపై గాయలు కావడంతో స్థానిక సంజీవిని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు తోరణగల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తోరణగల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా తోరణగల్లు స్టేషన్‌లో పద్మశాలి బహుత్తమ నేకార సమాజ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మార్కండేయస్వామి దేవస్థానంలో గంగపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. తోరణగల్లు ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి మార్కాండేయస్వామి భావచిత్రాన్ని డోలుడప్పుల వాయిద్యాల ద్వారా ఊరేగించారు. ఎదురు బసవన్న గుడి వరకు జరిగిన ఊరేగింపులో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుల్తాన్‌పుర వద్ద లింగదహళ్లి గ్రామం, కుడితిని, కురేకుప్ప, గ్రామం తోరణగల్లు గ్రామం నుండి పద్మశాలి కులస్తులు విశేషంగా హాజరయ్యారు. గౌరవాధ్యక్షుడు, సలహాదారులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● ఇంటింటి సందర్శనలో డీహెచ్‌ఓ రమేష్‌బాబు



గర్భిణిని పరీక్షిస్తున్న డీహెచ్‌ఓ రమేష్ బాబు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చామని తెలిసిన నాటి నుంచి ఆరోగ్యంపై అశ్రద్ధ వీడాలని, వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేష్ బాబు సూచించారు. సోమవారం ఎమ్మిగనూరు గ్రామంలోని గర్భిణీ ఇంటిని సందర్శించిన ఆయన వారితో మాట్లాడుతూ గర్భిణులు రక్తపోటు అధికం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. మొదటిసారి గర్భం దాల్చడం, ఎత్తు తక్కువగా ఉండడం, శరీర రక్తంలో ఐరన్ లోపం, కవల గర్భం, వంటి కారణాలు ఏవైనా ఉన్నా అవి ప్రమాదకరమైన గర్భాలు మారుతాయని జాగ్రత్త వహించాలన్నారు. తీవ్రమైన రక్తహీనత ఉంటే కనీసం 180 ఐరన్ మాత్రలు, డాక్టర్ సలహామేరకు సుక్రోజ్ ఇంజక్షన్ , అవసరమైతే రక్తమార్పిడి, ఈదశలో కూడా మెరుగు పడకపోతే స్వయంగా ప్రసూతి వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే స్కాన్ చేయాలని సూచించారు. మొదటి డెలివరీ శస్త్రచికిత్స ద్వారా జరిగితే తిరిగి గర్భం దాల్చే కాలాన్ని కనీసం 3సంవత్సరాలు పొడిగించాలన్నారు. ఈసందర్భంగా తాలూకా ఆరోగ్య అధికారి డా.అరుణ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దాసప్పనవర్, డీఎస్‌ఓ గిరిష్, సినీయర్ ఇన్‌స్పెక్టర్ బసవరాజ్, సిబ్బంది బసనగౌడ, కృష్ణమూర్తి, గీత,పూజ, సుధ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

● ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్



కార్మికులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

తోరణగల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అలాగే సామాజిక మాధ్యమాలకు దూరంగా వుండాలని ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్ సూచించారు. సోమవారం సండూరు పట్టణంలోని దేవరాజు అరసు మెట్రిక్ పూర్వ బాలికల విద్యాలయ నూతన కట్టడం ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి, చదువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులను గౌరవిస్తూ సహ విద్యార్థులతో కలసిమెలసి వుండాలని ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలలో సండూరు ప్రథమస్థానంలో నిలపాలన్నారు. ఈ సందర్భంగా బాలకీయుల పదవీపూర్వ కాలేజీ ఆవరణ, ఆట మైదానం భూమిపూజ, రాజా కాలువకు రాస్తా అభివృద్ధి పనులు ఏపీఎంసీ వెనుక భాగంలో మురికి కాలువ రస్తా, నిర్మాణ పూజ మొదలగు 14కు పైగా పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్మిక శాఖ నుంచి కట్టడ కార్మికులకు కిట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్‌కుమార్, పురసభ అధ్యక్షులు సిరాజ్ హుస్సేన్, ఉపాధ్యక్షురాలు లత, ఉజ్జప్ప తాలుకా ఈవో షడాక్షరయ్య, పురసభ సభ్యులు, పట్టణ ప్రముఖులు మొదలగు వారు పాల్గొన్నారు.



ధర్నాలో బంగారు, వెండి వ్యాపారులు, కార్మికులు

బంగారు వ్యాపారులు, కార్మికుల ధర్నా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆభరణాల చోరీ కేసులపై విచారణ పేరుతో వ్యాపారులు, కార్మికులను వేధించ డాన్ని నిరసిస్తూ బంగారు, వెండి కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. బంగారు, వెండి కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయం నుంచి తేరువీధి, బెంగళూరు రోడ్డు, మోతీసర్కిల్, స్టేషన్ రోడ్డు మీదుగా పాత జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు తొలుత ర్యాలీ నిర్వహించారు. విచారణ సాకుతో వ్యాపారులు, కూలీలను బెదిరిస్తున్నారని, పోలీస్‌స్టేషన్‌కు తరలించి అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచకుండా అక్రమ నిర్బంధంలో ఉంచడం సరికాదన్నారు. విచారణ, విచారణకు ముందు యూనియన్ ఆఫీస్ బేరర్లను కలవకుండా, కార్యాలయంలో ప్రశ్నించకుండా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడం సరికాదన్నారు. చోరీ కేసులను సక్రమంగా విచారించాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎండీ జావీద్ డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజలో వినియోగదారుల కమిషన్ చైర్మన్ తిప్పేస్వామి

బళ్లారి గాంధీనగర్/ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్ చైర్మన్ తిప్పేస్వామి పలు అభివృద్ధి పనులకు సోమవారం భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయం ఎదుట నూతనంగా నిర్మించిన వినియోగదారుల మధ్యవర్తిత్వ కేంద్రం మొదటి అంతస్తు భవన నిర్మాణానికి రూ.53.82 లక్షలతో భూమిపూజ చేశారు. ఈసందర్భంగా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మహిళా సభ్యురాలు శశికళ, సీనియర్ నాయకులు ఆకలయ్య, బి.వెంకటేశ్‌ప్రసాద్, మల్లికార్జున, సత్యనారాయణ,జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధికారులు, సిబ్బంది, భూసేన కార్పోరేషన్ సిబ్బంది తదితరులున్నారు.

అర్హులందరికీ పథకాలు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, ఫిబ్రవరి 3(ఆంధ్ర జ్యోతి): గ్యారెంటీ పథకాలను అర్హులైన అందరికీ అందేటట్లు చూడాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో గ్యారెంటీ పథకాల కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఐదు గ్యారెంటీ పథకాలను పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. గృహలక్ష్మీ, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు యువనిధి పథకం, పేద ప్రజలకు రేషన్‌కార్డు లబ్ధిదారులకు పది కిలోల బియ్యం పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా సిరుగుప్ప తాలుకా గ్యారెంటీ పథకాల కమిటీ అధ్యక్షుడు మారుతీ వరప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, గ్యారెంటీ పథకాల అధికారులు, తాలుకా పంచాయతీ ఈఓ పవన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిజమైన కార్యకర్తకు ఎప్పుడూ గుర్తింపు

● మాజీ మంత్రి శ్రీరాములు ● పదాధికారులకు అభినందనలు



తాలుకా అధ్యక్షులను అభినందిస్తున్న మాజీ మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్సీ సతీష్

కంప్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి, పార్టీ గెలుపునకు కృషి చేసే నిజమైన కార్యకర్తకు పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రులు శ్రీరాములు తెలిపారు. కంప్లి పట్టణంలోని తుంగభద్ర బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మహదేవను, కురుగోడు అధ్యక్షుడిగా ఎన్నికైన మదిరి కుమారస్వామిని ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందన్నారు. వృద్ధులు, మహిళలు, యువకులకు ఎవరి ఖాతాలోను ఇంతవరకు డబ్బు జమకాలేదని, ఎన్నికల సమయంలో మాత్రం వారి ఖాతాలో డబ్బు జమచేశారే గానీ అనంతరం ఎలాంటి డబ్బులు విడుదల చేయలేదన్నారు. పథకాలు కేవలం ప్రచారానికే వాడుకుంటున్నారన్నారు. సండూరు ఎన్నికల సమయంలో మూడు రోజుల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక ఎమ్మెల్యేను గెలిపించుకునేందుకు వుండాల్సి వచ్చిందని, అయినా అతి తక్కువ మెజార్టీతో గెలిచారన్నారు. కాంగ్రెస్ చేష్టలతోనే సుగర్ ఫ్యాక్టరీ పనులు ఆగిపోయాయన్నారు. రాబోయే కాలంలో ప్రజలే వారికి బుద్ధిచెబుతారన్నారు. మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు మాట్లాడుతూ తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా వున్న సమయంలో ప్రతి గ్రామంలో పూర్తిగా అభివృద్ధి చేపట్టి కంప్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేపట్టి ఆదర్శ నియోజకవర్గంగా మార్చామన్నారు. అప్పట్లో రాష్ట్రంతో చర్చించి ఎన్నో నిధులు తీసుకువచ్చినా ప్రస్తుత ఎమ్మెల్యే ఆ పనులకు భూమిపూజ చేస్తూ తామే నిధులు తీసుకువచ్చినట్లు చెబుతున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్సీ సతీష్, మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, ఎర్రంగళి తిమ్మారెడ్డి తదితరులు నూతనంగా వారిని అభినందించారు. కంప్లి కురుగోడు గ్రామాల పట్టణాల నుంచి వచ్చిన కార్యకర్తలు వారిని అభినందించి సన్మానించారు.

చిన్నదాసర సమాజాన్ని గుర్తించిన బీజేపీ

జిల్లాలో చిన్నదాసర సమాజాన్ని గుర్తించి సరైన ప్రాధాన్యం ఇచ్చిందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కంప్లి తాలుకా బీజేపీ అధ్యక్షుడిగా మహదేవను ఎన్నుకోవడం అభినందనీయమని బీజేపీ కుడితిని పట్టణ నాయకులు దుగ్గెప్ప తెలిపారు. సోమవారం కుడితిని పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన్ని బీజేపీ కార్యకర్తలు పూలమాలలతో సత్కరించి సన్మానించారు. వారితో పాటు సంపత్, మెట్రి, దరోజీ, కుడితిని నాయకులు, పదాధి కారులు తదితరులు పాల్గొన్నారు.



మహదేవను అభినందిస్తున్న దాసర సమాజ నాయకులు

హోసూరు జోన్

చంద్ర చూడేశ్వర ఆలయంలో అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ప్రియాంక తదితరులు

హోసూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హోసూరులోని మరగతాంబ సమేత చంద్ర చూడేశ్వర ఆలయంలో సోమవారం మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, తహసీల్దార్ చిన్నస్వామి, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మన్ మాదేశ్వరన్, జిల్లా ధర్మకర్త కమిటీ సభ్యుడు విజయకుమార్, డివిజన్ కార్యదర్శి రాము, కార్యనిర్వహణాధికారి సమితి అధికారులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ పోరాటానికి వెయ్యి రోజులు

● రేపు భారీ నిరసన ప్రదర్శన : కమిటీ కన్వీనర్ బసవరాజ్ కళస



విలేకరులతో మాట్లాడుతున్న బసవరాజ్ కళస

రాయచూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ మంజూరు మంజూరు కోసం సాగుతున్న పోరాటం బుధవారానికి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ రోజు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన ర్యాలీ చేపడుతామని ఎయిమ్స్ పోరాట కమిటీ కన్వీనర్ బసవరాజ్ కళస అన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్రిబవరి 5న నగరంలోని కర్ణాటక సంఘం ఆధ్వర్యంలో వివిధ కళాశాల విద్యార్థులు. రైతులు, మహిళలు, దళిత అభ్యుదయ సంఘాలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తారానాథ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్, ఠాగూర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌తో సహ నగరంలోని అన్ని విద్యా సంస్థలు మద్దతునిస్తున్నాయని వివరించారు. అదే విధంగా కల్యాణ కర్ణాటక జిల్లాల నుండి వివిధ సంఘాలకు చెందిన కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనేందుకు మద్దతు తెలిపారన్నారు.

వైభవంగా జలధి

అమరాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదుగూరు గ్రామంలో వెలిసిన కెంచమాంబదేవి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 3న ప్రారంభమైన ఉత్సవాలు 5వతేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీవారు తెలిపారు. సోమవారం అమ్మవారికి జలధి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆలయం నుంచి వంక వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి వంకలో జలధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి 101 ఆకులతో ఎడలువేసి మహా మంగళహారతి ఇచ్చారు.

తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం



భూమి పూజలో కలెక్టర్ సరయు తదితరులు

హోసూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని హోసూరు టైటాన్ ఫ్యాక్టరీ సీఎస్ఆర్‌లో భాగంగా పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, చెరువుల పూడికతీత వంటి పనులు చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం కృష్ణగిరి ప్రభుత్వ ఉపాధ్యాయ పాఠశాల ఆవరణలో ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు రూ.84 లక్షల 50 వేలతో 6 తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో హోసూరు టైటాన్ కర్మాగారం మేనేజర్ వైరవేల్, జోనల్ మేనేజర్ డోమినిక్, ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి, జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారి ఇంటర్వ్యూ అసిస్టెంట్ వెంకటేశం, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ సర్దార్, విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, టైటాన్ గ్రూప్ మేనేజర్లు సంజీవ్, గీత, టైటాన్ కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన



నాటక ప్రదర్శనలో కళాకారులు

హోసూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన కెలవరపల్లి డ్యాం వద్ద సపలమ్మ జాతర వైభవంగా సాగుతుండగా, పౌరాణిక నాటకాల ప్రదర్శనలు ప్రజలను అలరించాయి. ఓవైపు పరుషలో పశువుల విక్రయాలు జోరుగా సాగాయి. ఆదివారం రాత్రి 100కుపైగా పల్లకీ వాహనాలో గ్రామ దేవతలను ఊరేగించారు. పండుగ చివరి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం వివిధ రకాల పదార్థాలతో అన్నప్రసాదం సమర్పించారు. సపలమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయచూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు పట్టణంలోని హుణకుంటి క్రాస్ సమీపంలో సోమవారం సాయంత్రం బైక్, కారు ఢీ కొని ప్రమాదం జరిగింది. బైక్ పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు యస్కి తాలూకాలోని తలేఖాన్ సమీపంలోని యారదొడ్డి నివాసి బసనగౌడ(30)గా గుర్తించారు. యాదగిరి జిల్లా సురపూర నుంచి దావణగెరెకు వెళుతున్న వ్యాగ్నర్ కారును ముద్గల్ నుంచి లింగసుగూరు వైపు వస్తున్న బైక్ ఢీకొనడంతో బైక్ చోదకుడు(రైడర్) అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న లింగసుగూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



సహాయక చర్యల్లో స్థానికులు